1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 347 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 16 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 347 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 16 December 2025 PAGES : 8 PRICE : 3/-

## "వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు"... మంత్రి నారా లోకేశ్ పోస్టుతో సర్వత్రా ఆసక్తి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది. "వైజాగ్... సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ -మిగతా 2లో

## ఢిల్లీలో తీవ్ర పొగమంచు: ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో జాప్యం



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 15)

ఢిల్లీలో తీవ్రమైన పొగమంచు కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటన లో జాప్యం నెలకొంది. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటనకు సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రధాని మోదీ బయల్దేరాల్సి ఉంది. అయితే ఢిల్లీ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ప్రధాని విమానం ఆలస్యమయినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

**పలు విమాన సర్వీసుల్లో అంతరాయం..**

మరోవైపు పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి -మిగతా 2లో

## ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ.. దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం

రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనాన్ని సందర్శించిన చంద్రబాబు
శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీతో ప్రత్యేకంగా సమావేశం
ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ కార్యాలయం ఏర్పాటుపై కీలక చర్చలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగారెడ్డి జిల్లా చేగూరులోని ప్రఖ్యాత కన్హా శాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్ (దాజీ) ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, దాజీ ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.

ఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విషయంపై చంద్రబాబు దాజీతో సమాలోచనలు జరిపారు. కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ చేపడుతున్న కార్యక్రమాల గురించి దాజీ సీఎంకు వివరించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణం, సుస్థిర వ్యవసాయం, ధ్యానం, యోగా శిక్షణ వంటి అంశాలపై జరుగుతున్న కృషిని ఆయన చంద్రబాబుకు తెలిపారు. శాంతి వనంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో శ్రీరామచంద్ర మిషన్ ఈ శాంతి వనాన్ని అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌గా ఇది గుర్తింపు పొందింది. 8 లక్షలకు పైగా వృక్ష జాతులతో జీవవైవిధ్య కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడి హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ ద్వారా 'కౌశలం' పేరుతో యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

## పోలీసు శాఖలో రూ.1000 కోట్ల ప్రాజెక్టులు సిద్ధం: మంత్రి అనిత

ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్
గత ప్రభుత్వం మోడల్ పోలీస్టేషన్లను నిర్లక్ష్యం చేసిందన్న మంత్రి అనిత
రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడి
రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ నిర్మాణం త్వరలో ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)

ఏపీలో మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణం గత ఐదేళ్లలో పూర్తిగా నిలిచిపోయిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. 2019కి ముందు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మోడల్ పోలీస్టేషన్లనే గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తనను అరెస్టు చేసి అలాంటి ఒక స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని ఆమె గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.509 కోట్లతో పలు భవన నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. త్వరలోనే రూ.179 కోట్లతో కొత్త నిర్మాణాలు, రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు.ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేతిలో సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి వివరించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కార్యాలయాలు లేవని, వాటి నిర్మాణాలపై దృష్టి సారిస్తామన్నారు. కొత్త ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, -మిగతా 2లో

## ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ... మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు సహకరించాలని విజ్ఞప్తి
రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మద్దతు కోరిన లోకేశ్
ఏపీలో ఏఐ మిషన్ వేగవంతానికి సాయంపై కీలక చర్చ
లోకేశ్ వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన కోసం ఏఐ టెక్నాలజీతో రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు -మిగతా 2లో

## వైద్యకళాశాలలపై జగన్‌వి దొంగ నాటకాలు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)

పేద వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మించాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీన్ని అడ్డుకునేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. అనకాపల్లిలోని తెదేపా పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల అంశంపై జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించేందుకు -మిగతా 2లో

## రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప ఆయనకు దేనిపైనా అవగాహన లేదు: ఎమ్మెల్యే నల్లమిల్లి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 15)



వైకాపా హయాంలో ధాన్యం కొనుగోలు, సాగునీరు, ఎరువుల సరఫరా విషయాల్లో రైతులకు చేసిన మేలేంటో చెప్పాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. వైకాపాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడారు. "బహిరంగ చర్చకు రావాలని ఎన్నిసార్లు అడిగినా మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పరు. కేవలం వీడియోలు మాత్రమే చేస్తారు. ఆయన ప్రచారాలతో గందరగోళ వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలో యూరియా కొరత లేదు. నాలుగు మండలాలకు సంబంధించి మొదటి విడత 2,918 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే.. ఇప్పటికే 2,173 మెట్రిక్ టన్నులు రైతులకు అందించాం. రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డికి దేనిపైనా అవగాహన లేదు. ఒకేసారి రైతులకు యూరియా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారు. వైకాపా నేతలు చెప్పే మాటలను రైతులు పరిగణనలోకి తీసుకోవద్దు. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగుతోంది. రూ.14వేల కోట్లతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోంది" అని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.

## మన పర్వతంపై.. అమెరికా నిఘా పరికరం: భాజపా నేత సంచలన వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 15)

మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీపై భాజపా నేత నిషికాంత్ దూబే సంచలన వ్యాఖ్యలు చేశారు. వారు మన దేశంలోని ఒక పర్వతంపై నిఘా పరికరం అమర్చేందుకు అమెరికాకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు."చైనా కార్యకలాపాలపై నిఘా కోసం భారత్‌లో అమెరికా కు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నేతృత్వంలో కోవర్ట్ ఆపరేషన్ దశలవారీగా జరిగింది. నెహ్రూ హయాంలో తొలిసారి అణు ఆధారిత నిఘా పరికరాన్ని నందాదేవీ పర్వత శిఖరాన (ఉత్తరాఖండ్‌లోని) అమర్చేందుకు అనుమతించారు. తర్వాత ఇందిరాగాంధీ హయాంలోనూ అందుకు అనుమతి లభించింది. తర్వాత అగ్రరాజ్యం అక్కడి నుంచి తన కార్యకలాపాలను ఉపసంహరించుకుంది. పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయన్ ప్రాంతంలో ఆ ప్రమాదకర పరికరాన్ని వదిలేసి వెళ్లిపోయింది. ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు గంగానది ఒడ్డున నివసిస్తోన్న ప్రజల్లో క్యాన్సర్ కేసులు పెరగడానికి ఇది కారణం కాదా..? హిమానీనదాలు కరగడానికి, క్లౌడ్‌బరస్ట్, ఇళ్లల్లో పగుళ్లకు ఇదే కారణమా..? పార్లమెంట్‌లో 1978లో ఈ విషయాన్ని అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ అంగీకరించారు. అమెరికా వార్తా సంస్థ న్యూయార్క్ టైమ్స్ -మిగతా 2లో

## దివ్యాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 15)

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది అని వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు అన్నారు. సోమవారం కనిగిరి వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం అవసరమని గుర్తించి ఆంధ్ర రాష్ట్ర కోసం అమరా నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు త్యాగం ఎవరు మరువలేనిది అన్నారు, ఆయన త్యాగం ఫలితంగా దేశంలో అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయని ఆయన గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు పూర్వికులు ఆయన జన్మస్థలం కనిగిరి నియోజకవర్గం ఉండడం గర్వంగా ఉందన్నారు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పొట్టి శ్రీరాములు పాలేటి పల్లి రిజర్వాయర్ కు పేరు పెట్టడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక కనిగిరి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు, వేగినేటి వెంకట సుబ్బారెడ్డి, వేముల మైనర్ బాబు, శ్రీరామ లక్ష్మి, కనిగిరి పట్టణ ప్రజా హక్కుల వేదిక అధ్యక్షులు సునీల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## 21న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 15)

జాతీయస్థాయి పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 21వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో విడుదల చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 21వ తేదీన అన్ని ప్రాంతాలలో పల్స్ పోలియో చుక్కల మందు వేయాలన్నారు. 22, 23వ తేదీలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల మందు వేయాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలు వేయాలని పలు సూచనలు చేశారు. రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలు పరిపూర్ణంగా అందించిన 17 వైద్యశాలలకు జిల్లా కలెక్టర్ అవార్డులను ప్రదానం చేశారు. సంబంధిత వైద్యాధికారులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హాకీ పోటీలకు మద్దిపాడు విద్యార్థి ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12, 13 తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగిన అండర్ 17వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టు తరఫున పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మద్దిపాడు విద్యార్థి ఎం.అను ప్రతిభ కనపరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వీరు త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో జరగబోయే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ పిడిలు కె వనజ, బి సౌజన్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణి, పీడీ లను ప్రత్యేకంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి మాల్యాద్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## "వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు"... మంత్రి నారా లోకేశ్ పోస్టుతో సర్వత్రా ఆసక్తి

ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా?" అంటూ లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

## దిల్లీలో తీవ్ర పొగమంచు: ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో జాప్యం

వెళ్లే పలు విమాన సర్వీసుల్లో ఆలస్యం నెలకొన్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇండిగో, ఎయిరిండియా వంటి పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. విమానాశ్రయంలో దృశ్యగోచరత తగ్గడం వల్ల పలు విమానాలు రద్దు కాగా.. మరికొన్ని ఆలస్యమయ్యాయని తెలిపాయి. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవడం కోసం తమ వెబ్‌సైట్లను పరిశీలిస్తూ ఉండాలని ప్రయాణికులకు సూచించాయి. ఆలస్యం వల్ల కలిగిన అసౌకర్యానికి ప్రయాణికులకు క్షమాపణలు తెలిపాయి. ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చుడానికి చర్యలు తీసుకుంటున్నామన్నాయి. ఇదీ చదవండి: ప్రాణాలను పణంగా పెట్టి.. ఉగ్రవాదులకు ఎదురొడ్డి.. 'రియల్ హీరో' అహ్మద్

## పోలీసు శాఖలో రూ.1000 కోట్ల ప్రాజెక్టులు సిద్ధం: మంత్రి అనిత

ఎండీ రవిప్రకాశ్ నాయకత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగలేదని విమర్శించారు. హోంమంత్రి, ఉన్నతాధికారుల సహకారంతో రెండేళ్లలోపు నిర్దేశిత పనులన్నీ పూర్తి చేసి, సంస్థకు మరింత మంచి పేరు తీసుకొస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, కార్పొరేషన్ ఎండీ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## మన పర్వతంపై.. అమెరికా నిఘా పరికరం: భాజపా నేత సంచలన వ్యాఖ్యలు

ఇటీవల ఈ కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడు మన భావితరాలను కాపాడుకునే సమయం ఆసన్నమైంది" అని ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఆ అంశంపై 1978లో అమెరికా చట్టసభ సభ్యులు తమ ప్రభుత్వానికి రాసిన లేఖను షేర్ చేశారు. ప్లుటోనియంతో నడిచే ఈ నిఘా పరికరం మిస్ అయిందని దూబే పోస్ట్‌ను బట్టి తెలుస్తోంది . దానినుంచి వెలువడే రేడియో ధార్మికత గురించి ఆ లేఖలో సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. అదే నిజమైతే.. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి, బాధ్యత వహించాలని తమ ప్రభుత్వాన్ని కోరారంటూ దూబే మరో పోస్టు చేశారు.

కొన్ని నెలల క్రితం కూడా దూబే ఈ విషయంపై కాంగ్రెస్ ను విమర్శించారు. నందాదేవీ పర్వతంపై కనిపించకుండా పోయిన అమెరికా అణు పరికరానికి, ఉత్తర భారతంలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలకు ముడిపెడుతూ విమర్శలు చేశారు. నెహ్రూ, ఇందిరతో పాటు రాహుల్ గాంధీ విదేశీ శక్తులకు లొంగిపోయి, దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని విమర్శించారు. వారి చర్యలు పర్యావరణం, రైతులు, భావితరాలకు ప్రమాదకరంగా మారాయని ఆరోపణలు చేశారు.

## ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ... మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ

కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని '%ఖలిరిశిఖ% స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.

## వైద్యకళాశాలలపై జగన్‌వి దొంగ నాటకాలు

రమ్మంటే రాని ఆయన.. ఇప్పుడు కోటి సంతకాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టారని.. అక్కడ మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగించిన జగన్.. ప్రతిపక్షంలోనూ అదే విధానాన్ని కొనసాగించాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆ ఆటలు సాగవన్నారు. ఈ సమావేశంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి గణిత వేడుకలలో మెరిసిన బాలుర ఉన్నత పాఠశాల ఆణిముత్యం బానుసాకేత్



### రూ.5వేల ప్రోత్సాహక బహుమతి అందజేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 15)

విద్యార్థులలో గణిత పాటవం అనేది సమస్య పరిష్కారం, సాంకేతికతలో నైపుణ్యం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. గణిత పోటీ పరీక్షలు విద్యార్థులలో తార్కిక ఆలోచన లోతైన, ధీటైన విద్యార్థులలో పోటీ తత్వం పెంచడానికి శాయశక్తుల కృషి చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు కాళంరాజు వేణుగోపాల్‌ని మనందరి తరపున అభినందిస్తున్నానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు చెరో రూ.2500 వంతున రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. మార్కాపురం నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయుల క్రీడల ప్రారంభానికి బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురం విచ్చేసిన ఆయన ఆ కార్యక్రమంలో భాగంగా ఇటీవల బాలుర ఉన్నత పాఠశాల నుండి వివిధ కార్యకమాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయి ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులు భానుసాకేత్, హరికిరణ్‌లకు ప్రోత్సహక బహుమతి అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా 13, 14 తేదీల్లో విజయవాడ శ్రీరస్తు కళ్యాణ మండపం నందు నిర్వహించిన రాష్ట్ర స్థాయి గణిత వేడుకలలో నిర్వహించిన మాథ్స్ ఫెయిర్ నందు వీడియో మేకింగ్ విభాగంలో మా పాఠశాల 9వ తరగతి విద్యార్థి భానుసాకేత్ రూపొందించిన "ప్రూఫ్ ఆఫ్ పైథాగరస్ థియరం" అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొంది సర్టిఫికెట్, రూ.4 వేలు నగదు బహుమతి సాధించడం మాకు, మా పాఠశాలకు ఎంతో గర్వకారణం అని బహుమతి సాదించిన విద్యార్థి భానుసాకేత్ ని, అలాగే భారతీయ విజ్ఞాన మండలి వారు నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రతిభా పాఠవ పరీక్ష కౌశల్ 2025 క్విజ్ విబాగం నందు మా పాఠశాల చిన్నారి హరి కిరణ్ చక్కటి ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయికి ఎంపికయి ఈ నెల 27వ తేదీన తిరుపతి పట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీలలో మా పాఠశాల తరపున పాల్గొనే చక్కటి అవకాశం లభించిందన్నారు. సహకారం అందించిన గణిత ఉపాధ్యాయుడు ఆంజనేయులుని అభినందిస్తూ మన విద్యార్థులు అందరూ ఈ గెలుపు ప్రేరణతో ఇష్టమైన సబ్జెక్ట్ నందు చక్కటి కృషి చేసి మంచి పేరు సంపాదించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శార్వానీ, సుజాత సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మల్లునాయక్, మార్కాపురం నియోజకవర్గం లోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా సంబరానికి ఎంపికయిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భాష ప్రయుక్త రాష్ట్రాల సాధనకు పొట్టి శ్రీరాములు స్ఫూర్తిదాయకం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 15)

భాష ప్రయుక్త రాష్ట్రాల సాధనకు పొట్టి శ్రీరాములు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్లో జరిగింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ రోజుగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. స్థానిక పిజిఆర్ ఎస్ హాల్ లో ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్డీఓ గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంత రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నా పెన్షన్ ఇప్పించండి సార్....

### అంటూ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామిని వేడుకున్నమహిళ స్పందించిన మంత్రి

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 15)



మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామానికి చెందిన గంజరపల్లి లక్ష్మమ్మ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని కొండేపిలోని ఆయన నివాసంలో కలిసి ఆమె భర్త కాశయ్య సాంఘిక సంక్షేమ (ఎస్ సి ) వసతి గృహంలో కుక్కర్‌గా ఉద్యోగం చేసి పదవి విరమణ చేసిన తర్వాత మరణించడం జరిగిందని ఆమె తెలిపింది. ఇప్పటికే ఆమె భర్త చనిపోయి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నదని ఆమె తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ అయిన తన భర్త కాశయ్య చనిపోయినప్పటికి ఆయనకు సంబంధించిన పెన్షన్ భార్య అయిన తనకు రావలసి ఉండగా అధికారులు పట్టించుకోలేదని అన్నారు. ఆమె దిక్కుతోచని పరిస్థితులలో ఎవరిని సంప్రదించినా కాలయాపన తప్ప ఆమెకు ఎలాంటి న్యాయం గాని, ప్రయోజనం గాని జరగడం లేదని మంత్రి వద్ద ఆమె గోడు వెళ్ళబోసుకున్నది. ప్రస్తుతం వెంకటలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ, పూటగడవక ఎలాంటి కూలి పనులకు పోలేకపోతున్నానని, నాకు ఆరోగ్యం సహకరించడం లేదని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని అనేక సమస్యలను మంత్రికి విన్నవించు కోవడం జరిగిందన్నారు. ఆమె స్థితిగతులను తెలుసుకున్న మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి వెంటనే స్పందించి ఆమెకు భర్త తరపున రావలసిన పెన్షన్‌ను తనవంతు శక్తివంచన లేకుండా న్యాయం చేస్తానని ఆమెను ఓదార్చి తప్పక న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం మంత్రికి ఆమె సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈమె వెంట కొండేపి జనసేనపార్టీ ఇన్చార్జి మనోజ్, జి మహేష్, వెన్మా రాజరాం రెడ్డి, ఎస్‌కె రఫీ, తదితరులు పాల్గన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 15.12.25 మంగళవారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం



## మీ కన్నా పేద విద్యార్థులకు ఎక్కువ సీట్లు ఇస్తాం

**మెడికల్ కళాశాలలపై వైసీపీ ది పూర్తిగా విష ప్రచారం**

**ప్రజలు చీదరించుకొని 11 సీట్లకు పరిమితం చేశారు**

**మెడికల్ కళాశాలలు ప్రభుత్వ మెడికల్ కళాశాల పేరుతోనే ఉంటాయి**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైసీపీ ప్రభుత్వం కేవలం 64 సీట్లు మాత్రమే ఇస్తానని పేర్కొందని, అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం 75 సీట్లు పేద విద్యార్థులకు (తరువాయి 4లో...)

# పార్టీ కోసం కష్టపడ్డ ఒక్క కార్యకర్తకు కూడా అన్యాయం జరగనివ్వను...

# యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి

## విదేశాల నుంచి వచ్చిన యువనేత కందుల విగ్నేష్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ పోటెత్తిన అభిమానం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 15)**

పార్టీ కోసం కష్టపడ్డ ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వను అని యువనేత, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు కందుల విగ్నేష్‌రెడ్డి పునరుద్ఘాటించారు. చాలా రోజుల తర్వాత విదేశాల నుంచి స్వదేశానికి వచ్చిన యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డికి పొదిలి మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున అభిమానం పోటెత్తింది....ఆయనకు ఘన స్వాగతం పలికారు. విదేశాల నుంచి ఆదివారం మార్కాపురం స్వగృహానికి చేరుకున్న కందుల విగ్నేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం పొదిలి పట్టణంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని ఆయనకు పూలమాలలు, శాలువాలు, బొకేలు అందజేసి ఘనంగా సత్కరించి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలియజేశారు. పొదిలి శివాలయం కమిటీ ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరికీ అందించాడు యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి....ఈ సందర్భంగా కందుల విగ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ నాయకులు అందరూ కార్యకర్తలకు అండగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరికీ కందుల కుటుంబం అండగా నిలుస్తుందన్నారు. కందుల విగ్నేష్‌రెడ్డిని సత్కరించిన వారిలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు) విగ్నేష్‌రెడ్డికి శాలువా కప్ప కలియుగదైవం వేంకటేశ్వరస్వామి వారి 2026 డైరీని బహుకరించారు. అదే విధంగా మండల, పట్టణ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణగత, శివాలయం కమిటీ మాజీ ఛైర్మన్



సామంతపూడి నాగేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, తానికొండ వెంకట్రావు, తెలుగుయువత మండల అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొంట్ల రవికుమార్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం భాష, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# గ్రామీణ ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి మౌలిక వసతులు

**పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం కూటమి ప్రాధాన్యత**

**రావినూతల, చందలూరుల్లో జూనియర్ కళాశాలలు**

**సోలార్‌తో తగ్గనున్న విద్యుత్ వినియోగ భారం**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 15)**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గ్రామాల్లోనూ పట్టణాలకు ధీటుగా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొరిశపాడు మండలం, రావినూతల గ్రామంలో సోమవారం మంత్రి గొట్టిపాటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రూ.1.30 కోట్లతో నిర్మించిన అంతర్గత రహదారులు, కల్వర్టులు, సైడు కాల్వలను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఆ తరువాత రావినూతల గ్రామంలోనే రూ.20 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో సుమారు 30 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఒక్కొక్కటీ రూ.36 లక్షలతో నిర్మించే హెల్త్ సబ్ సెంటర్లతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సెంటర్ల నిర్మాణానికి అవసరమైన (తరువాయి 4లో...)

# పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం అవతరణ

**రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం అవతరించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం శ్రీ అమరజీవిపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న శ్రీ అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోల శ్రీ బాలవీరాంజనేయ స్వామి మరియు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి 15 కేజీల కిలోల బరువు తగ్గిన తర్వాత ప్రజలందరూ కూడా ఆయనకు సంఘీభావం తెలిపి మహా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి మరణించిన 10 నెలల తర్వాత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రభుత్వం ప్రకటించిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మ అర్పణ దినోత్సవం గత సంవత్సరం అధికారికంగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని ఆయన చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగానికి చిహ్నంగా అమరావతి రాజధాని లో 55 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పట్టుదల దేశవ్యాప్తంగా వ్యాపించే విధంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్నిసాధించారని ఆయన చెప్పారు. ఆంధ్రులపౌరుషానికి ప్రతీకగా భాష ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయ ని ఆయన చెప్పారు. మహాత్మాగాంధీ చేపట్టిన (తరువాయి 4లో...)

# వాజ్‌పేయ్ రాజకీయ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

స్వర్గీయ అటల్ బిహారీ వాజ్పేయి రాజకీయ జీవితం అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు సివిఎన్ మాధవ్ లు అన్నారు. అటల్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా ఒంగోలు పాత బైపాస్ జాతీయ రహదారి పై సోమవారం అటల్ బిహారీ వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం వైభవంగా సాగింది. జిల్లా అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులతో పాటు జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు, సంతనూతలపాడు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బి ఎన్ విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి,20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, పర్యాటక సంస్థ ఏపి ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఉడా ఛైర్మన్ షేక్ రియాజ్, బిజేపి ఏపి రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ ఎన్ సూర్య కళ్యాణ్ చక్రవర్తిలతో పాటు కూటమి నేతలు హాజరయ్యారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఆయన రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగింపుగా ఏపిలో కూటమి (తరువాయి 4లో...)

## మీ కన్నా పేద విద్యార్థులకు ఎక్కువ సీట్లు ఇస్తాం

అందించేందుకు సిద్ధంగా ఉందని, మెడికల్ కళాశాల పై వైసిపి విష ప్రచారం కొనసాగిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కేవలం 18 శాతం మాత్రమే మెడికల్ కళాశాలలను నిర్మించింది అన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణంలో మాత్రమే పి పి పి విధాన ఉంటుందన్నారు. సీట్లు కేటాయింపులో వైసీపీ చెప్పిన వారి కన్నా అధిక సీట్లు పేద విద్యార్థులకు దక్కుతుందని హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో ఓపి, వైద్యం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అందిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి సొంత పులివెందులలోనే కళాశాల నిర్మించుకోలేని అసమర్థుడు జగన్మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. వీళ్ళ దుష్ప్రచారం కారణంగానే ప్రజలు చీదరించు కొని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. కేవలం మనుగడ కోసమే లేని సమస్యను ఉన్నట్లుగా మెడికల్ కళాశాలలపై విష ప్రచారం చేస్తున్నారన్నారు.

## మెడికల్ కాలజీలను ప్రవైట్ పరం చేయవద్దు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 15)
ప్రకాశం జిల్లా ఒంగోలు కేంద్రంగా రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశంపై కూటమి ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేసిందని గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పేద ప్రజల మీద ప్రేమతో వైయస్ జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీ మంజూరు చేసి, నిర్మాణం చేపడితే కడుపు మంటతోటి చంద్రబాబు నాయుడు దానిని ప్రైవేట్ పరం చేశారని అన్నారు. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి ప్రాంతాల నుండి వైద్యం కోసం ప్రజలు నేటికీ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుశ్చితి ఏర్పడిందన్నారు. మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ ప్రభుత్వ నిర్వహణలో ఉంటే పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మెడికల్ కాలేజ్ ప్రైవేటికరణకు వ్యతిరేకంగా మార్కాపురం నియోజకవర్గంలో 85 వేల మంది సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ షంషీర్ అలీ బేగ్, మండల పార్టీ అధ్యక్షులు చెంచిరెడ్డి, పట్టణ అధ్యక్షులు రఫీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమరి శ్రీనివాసరెడ్డి, నాయకులు పిఎల్పి యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, నాయకులు ఉత్తంకుమార్, ఐదు మండలాల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 15)
మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బలసా సురేష్, కార్యదర్శి పొన్నూరు రామాంజనేయులు, ఉప కార్యదర్శి దివ్యనందగుప్త, కోశాధికారి మేడ అర్జున్, కమిటీ సభ్యులు తాతా రామచంద్రరావు, బాపనపల్లి పవన్ కుమార్, తాత సత్యనారాయణ, పచ్చిపులుసు కృష్ణ, కనుమర్లపూడి శ్రీనివాసరావు, పలువురు పాల్గొన్నారు.



## తుమ్మల చెరువు మండల ప్రాథమిక ఉర్దూ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా, స్థాయి పోటీలకు ఎంపిక పలువురి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 15)



మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని మండల ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో చదువుతున్న ఉర్దూ విద్యార్థులు మార్కాపురం నియోజకవర్గంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం యుఎఫ్‌క్యూఎస్, జమాతే ఇస్లామియా హింద్ ఆధ్వర్యంలో ఖుర్‌ఆన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తుమ్మలచెరువు గ్రామానికి చెందిన ఉర్దూ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు మృదు మధురమైన కంఠస్వరాలతో కురాన్ లోని సూరాలను అనర్గళంగా అవలీలగా ఆలపించడంతో వీరు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు విజేతరైన షేక్ షాహినా, షేక్ హాఫీజాలు జిల్లాకు ఎంపీగా, షేక్ రిదా రాష్ట్ర స్థాయికి పోటీలకు అర్హత సంపాదించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తబుసం, ఉపాధ్యాయురాలు భూదేవిలు తెలియజేశారు. దీంతో ముస్లిం పెద్దలు పోటీలో అర్హత సాధించిన విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ ఒక్క కార్యకర్తకు కూడా అన్యాయం జరగనివ్వను...

# యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి









విగ్నేష్‌రెడ్డిని కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆయన ఆప్యాయంగా పలుకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడంతో పాటు ఇంట్లోని మీ తల్లిదండ్రులు, అక్క చెల్లెల్లు ఎలా ఉన్నారంటూ అడుగుతుంటో ప్రతి కార్యకర్త తన ఇంటి బిడ్డ తమను యోగక్షేమాలు అడిగినట్లు భావించి పలువురు భావోద్వేగమయ్యారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ స్వగృహానికి చేరుకుని ఆయన తల్లిని పరామర్శించి క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. తదుపరి పట్టణంలని విశ్వనాథపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూమెన్ గార్మెంట్ షాపును ప్రారంభించి వారి ఆతిథ్యం స్వీకరించారు. తదుపరి పట్టణంలోని కీర్తి మెడికల్స్ షాపుకు వెళ్ళి గొంట్ల సాయి, రవికుమార్ లతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా సాయి, రవిల కుటుంబ సభ్యులు ఆయనకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కాసేపు ముచ్చటించిన అనంతరం తిరిగి







పార్టీ కార్యాలయనికి చేరుకుని పలువురు నాయకులతో చర్చించి మార్కాపురం స్వగృహానికి బయలుదేరి వెళ్ళారు.

## వాజ్‌పేయ్ రాజకీయ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం









పాలన సుపరిపాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ మహానాయులు గురించి నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రజా నేత, పరిపాలనలో ఆయనకు ఆయనే చాటి అని రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు వాజ్ పేయ్ అన్నారు. ప్రతి జిల్లాలో ఆయన విగ్రహం ఉండాలనే ఉద్దేశ్యంతో మోడీ సర్కార్ ముందుకెళ్తుందన్నారు. మోడీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. అనంతరం ఒంగోలు శాసన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఒంగోలులో స్వర్గీయ వాజ్‌పేయ్ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. పాత బైపాస్ సెంటర్‌ను వాజ్‌పేయ్ సర్కిల్‌గా నామకరణం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారెడ్డి, వీవీ శివారెడ్డి, దారా సాంబయ్య, యోగయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమరసింహం, రాయపాటి అజయ్, జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, పువ్వాడ దామోదర్, సీతారామయ్య, గుర్రం సత్యనారాయణ, రాజశేఖర్, నరాల శ్రీనివాసరెడ్డి, పిన్నంటి తిరుమలరావు, సింగోతు రాజేష్ వర్మ, బి విజయరావు, రమాదేవి, టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి మౌలిక వసతులు







ప్రభుత్వ స్థలాలను సంబంధిత తహశీల్దార్లు వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ప్రైవేటు దాతలు స్థలాలు ఇవ్వడానికి ముందుకు వస్తే హెల్త్ సెంటర్లకు వారి పేర్లను పెట్టాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం తన బాధ్యత అన్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే రూ.21.50 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐదు మండలాల పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళు _్నామని వెల్లడించారు. సోలార్ వినియోగంతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం గణనీయంగా తగ్గుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గుజరాత్ రాష్ట్రం సోలార్ వినియోగంతో ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. సూర్యఘర్ సోలార్ పథకం ద్వారా ఒక్కో వినియోగదారునికి రూ.78 వేలు సబ్సిడీ అందిస్తున్నామన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ రుణం ద్వారా ఐదారేళ్లలో తీర్చే వెసులుబాటు ఉందన్నారు. దేశవ్యాప్తంగా కోటి సోలార్ కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుంటే, అందులో 25 లక్షల కనెక్షన్లను ఆంధ్రప్రదేశ్ కు మంజూరు చేసినట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఒక్కో నియోజకవర్గానికి 10 వేల సోలార్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా 10, 20 మంది సోలార్ పెట్టుకుని దాని వల్ల ఉపయోగం ఉంటుందని భావిస్తేనే మిగిలిన వారు పెట్టుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో వచ్చే సోలార్ పథకాలను వినియోగించుకుంటే ప్రజలకే లాభమని మంత్రి తెలిపారు.

**కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు....** విద్యార్థులు కష్టపడి చదివితేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఆర్ ప్రాజెక్ట్స్, అసిస్ట్ సంస్థ సహకారంతో రావినూతల ఉన్నత పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. గతంలో ఒక్కో టీచర్ రెండు, మూడు సబ్జెక్ట్ లను బోధించేవారన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఒకేసారి 16,300 ఉపాధ్యాయులను డిఎస్సీ ద్వారా నియమించామని చెప్పారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం మరింత పెరిగే విధంగా బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనంతో పాటు సమయానికి యూనిఫార్మ్, బుక్స్, బ్యాగులను కూడా అందించామని మంత్రి గుర్తు చేశారు. అదే విధంగా రావినూతల, చందలూరు ప్రాంతాల్లో వచ్చే ఏడాదికి జూనియర్ కాలేజ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం అవతరణ

స్వాతంత్ర్య ఉద్యమంలో శ్రీ పొట్టి శ్రీరాములు చురుకుగా పాల్గొన్నారన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, గిద్దలూరు ఎమ్మెల్యే లు బి ఎన్ విజయ్ కుమార్, ముత్తుముల అశోక్ రెడ్డి, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మణనాయక్, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు అర్బన్ తహసిల్దార్ మధు సూదన్‌రావు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.













# నమోదైన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలి



## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 15)

రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసిల్దార్ కార్యాలయాలలో నమోదైన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు వీక్షణ సమావేశం ద్వారా హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించికున్నారు. కొన్నిటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపగా, కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. మొత్తంగా 173 అర్జీలు నమోదు అయ్యాయి. రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు బాగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండల కార్యాలయాలలో తప్పనిసరిగా పిజిఆర్ఎస్ జరగాలన్నారు. అధికారులకు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే ముందుగా తహసిల్దార్ కార్యాలయంలో అర్జీలను సమర్పించాలన్నారు. అక్కడ పరిష్కారం జరగకపోతే ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వాలన్నారు. అప్పటికీ పరిష్కారం దొరకని పక్షంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వాలని వివరించారు. ఈ విధానం ప్రజలకు అర్థమయ్యేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పంచాయతీ శాఖ, డిఆర్డిఏ, చీరాల మున్సిపాలిటీ, వేటపాలెం తహసిల్దార్ పరిధిలో అర్జీలు పెండింగ్ లో ఉండడంపై ఆరా తీశారు. పనరావృతమయ్యే అర్జీలలలో రిజిస్ట్రేషన్ శాఖకు 54 నమోదు కావడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్ అర్జీలపై ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహించాలన్నారు. ఇ-ఆఫీస్ విధానాన్ని అధికారులు అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆఫీస్ విధానంలో ఒకరోజు 9 గంటల్లో బాపట్ల జిల్లా నుంచి 1,363 ఫైల్స్ చూడడం, పరిష్కరించడంపై రాష్ట్రంలోనే ఏడో స్థానంలో నిలిచానన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులంతా కలెక్టర్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఖజానా శాఖలో ఇ-ఫైల్స్ ఒక్కటి కూడా నమోదు కాకపోవడంపై ఆరా తీశారు. నిర్లిప్తంగా ఉండరాదని, కచ్చితంగా ఈ ఫైలింగ్ జరగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

### కమిషనర్ కు వినతిపత్రం సమర్పించిన సిపిఎం నాయకులు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 15)

సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) సుందరయ్య కాలనీ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ 18వ వార్డు సుందరయ్య కాలనీ పట్టణ శివారు ప్రాంతంగా ఉండి అక్కడ నివసిస్తున్న వారందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలని, ఈమధ్య వరుసగా కురిసిన ఆకాల వర్షాలతో సుందరయ్య కాలనీలో చాలా స్తంభాలకు వీధి దీపాలు మరమ్మత్తులకు గురయ్యాయని, వర్షాలకు మట్టి రోడ్లు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయని, వీధుల ఇరువైపులా కంప చెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా మొలచి పాదచారులకు ఇబ్బందికరంగా ఉందని, వీధి దీపాలు వెలగకపోవడం వలన విష సర్పాలు తిరుగుతుండటంతో రాత్రివేళలో కాలనీవాసులు, చిన్నపిల్లలు వీధులలో సంచరించాలంటే భయాందోళనకు గురవుతున్నారని కమిషనర్ గారికి తెలుపగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ సుందరయ్య కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, సుందరయ్య కాలనీ శాఖ కార్యదర్శి సగిలి రాయప్ప, సభ్యులు దస్తగిరి, పత్తూరు యువరాజ్, చాపల్లి సుధాకర్, రాజు, షేక్ ఆదిల్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారించేలా ప్రత్యేక దృష్టి సారించాలి



## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

"ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారించేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాల్లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతిలతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో ఎలాంటి అలస్వతం ఉండరాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాక, వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు సానుకూల విధానంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రతిరోజు మానిటర్ చేస్తూ ఎలాంటి పెండింగ్ ఉంచుకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 264 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# ప్రజల డబ్బుకు భరోసా లేని విధానాలు అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుకు భరోసా లేని విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విధానాలు మారుస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఎల్ఐసి ఎఓఐ నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి బి వెంకట్రావు విమర్శించారు. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆమోదించడాన్ని నిరసిస్తూ ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఓఐ) ఆధ్వర్యంలో ఒంగోలు ఎల్ఐసి ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ఎల్ఐసి ఎఓఐ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాలం సుబ్బారావు, బి.వెంకట్రావు మాట్లాడుతూ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల దోపిడీ నుండి ప్రజలను రక్షించేందుకు 1956లో ఎల్ఐసి యాక్ట్- 1956 పార్లమెంటులో ఆమోదించబడిందని అన్నారు. దీని వల్ల ఎల్ఐసి లో ప్రజలు పెట్టే ప్రతి రూపాయికి కేంద్ర ప్రభుత్వం యొక్క గ్యారెంటీ ఉంటుందన్నారు. అటువంటి గ్యారెంటీని రద్దుచేసి, మరలా విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీల దయా దక్షిణ్యాలకు భారతదేశ ప్రజల యొక్క డబ్బును వదిలేసేదుకే ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకువస్తున్నారని అన్నారు. 1938 ఇన్సూరెన్స్ చట్టాన్ని కూడా మార్పు చేసి ప్రజలకు ద్రోహం చేస్తుందన్నారు. ప్రజలు, ఉద్యోగులు ఎల్ఐసి ఏజెంట్లు అందరూ ఈ ప్రమాదాన్ని గమనించి మోడీ ప్రభుత్వం తెస్తున్న ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ధర్నాకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) నెల్లూరు డివిజన్ ఉపాధ్యక్షులు పారా శ్రీనివాసరావు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎఓఐ బ్రాంచ్ అధ్యక్షులు యస్..వి. సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి పి.ఆంజనేయులు, నాయకులు దాసరి పురుషోత్తం రావు, రాయపాటి శ్రీనివాసరావు, ఎం సుబ్బారావు, వై.వెంకట్రావు, యం.కమలాకర్ రావు, పాపని సుబ్బారావు, బి.గజేంద్ర, కె.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, బి మురళి, షేక్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ పొదుపు, సమర్ధ వినియోగం పై

# ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి



## జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

విద్యుత్ పొదుపు, సమర్ధ వినియోగంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) ప్రకాశం సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు పట్టణంలో ఇంధన పొదుపు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. విద్యుత్ భవన్ వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు, యువతకు విద్యుత్ పొదుపు గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ ను పొదుపుగా వినియోగించడంతో పాటు భద్రంగా వినియోగించాలన్నారు. సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని పెంచాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయా విషయాలపై వారం రోజులపాటు వివిధ రూపాలలో ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను అధికార యంత్రాంగం రూపొందించింది అన్నారు. ఇది దిశగా రూపొందించిన పోస్టర్లను, బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.








# త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు ఉద్యమస్ఫూర్తి నేటికీ మార్గదర్శకం

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, పోలీస్ సిబ్బంది శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా శ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షతో ఆత్మార్పణ చేసి అమరుడయ్యాడన్నారు. ఆయన బలిదానం ఫలితంగా 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందన్నారు. తద్వారా భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. గాంధీ మార్గాన్ని అనుసరించి అనేక జాతీయ ఉద్యమాలలో ప్రముఖ పాత్ర పోషించారని, సత్యం, అహింస అనే ఆశయాలతో హరిజనుల ఉద్ధరణకు కృషి చేశారన్నారు. అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని జిల్లా ఎస్పీ కొనియాడారు. గొప్ప దేశభక్తుడు, సమాజసేవకుడు, పీడిత ప్రజల పక్షపాతి, అసలైన గాంధేయవాది అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఉద్యమస్ఫూర్తి, కార్యదీక్ష, త్యాగనిరతి నేటి తరానికి గొప్ప ఆదర్శమని తెలిపారు. మహానుభావుల త్యాగాలు, ఆదర్శాలను స్మరించుకోవడం ద్వారా దేశభక్తి, సేవాభావం మరింత పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి.వి రమణ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, పిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గప్రసాద్, డీటీసీ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ఆర్ఐ రమణరెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

# 17న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్, షర్మిలమ్మ జన్మదిన వేడుకలు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను, అలాగే పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ తో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకు లు నియోజకవర్గ సమన్వయకర్తలు, నగర, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, పార్టీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని సైదా కోరారు.

# పోస్టుల నియామకంలో అక్రమాలు జరగకుండా నిరోధించాలి

## సుజన్ మాదిగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

ఒంగోలు రిమ్స్ మెడికల్ కాలేజిలో భర్తీ చేసే టైపిస్ట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకంలో అక్రమాలు జరగకుండా నిరోధించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ తెలియజేశారు. సోమవారం ఒంగోలు రిమ్స్ మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గీతాంజలికి పోస్టుల భర్తీలో అక్రమాలు జరగకుండా ఉండాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీలో జరుగుతున్న టైపిస్ట్,జూనియర్ అసిస్టెంట్ల ఉద్యోగాల నియామకల్లో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు చాలామంది అప్లై చేసుకున్నారని, వారి యొక్క సర్టిఫికెట్లను గుర్తించి నిజమైన అర్హులకు ఉద్యోగాలు వచ్చు లాగున చూడాలని, దాంతో పాటుగా రిజర్వేషన్‌లో రోస్టర్ విధానాన్ని పాటించాలని, మెడికల్ కాలేజీలో ఉన్న తక్కువ పోస్టుల్లో నాన్ లోకల్ వారికి ఉద్యోగాలు ఇస్తే, లోకల్ లోఉన్నవారు ఇబ్బంది పడతారని వాటిని కూడా సరిచేయాలని ఏవో గీతాంజలిని కోరడం జరిగింది. దీని పై స్పందించిన ఏవో తప్పనిసరిగాలని రిజర్వేషన్ రోస్టర్ విధానాన్ని పాటిస్తామని, నకిలీ సర్టిఫికేట్‌తో అప్లై చేసుకున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పిఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు, తేళ్ల జయరాజ్, పొగడ్త నారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పై తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు
## జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు 90 ఫిర్యాదులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)
జిల్లా ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం)ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులకు అందించి, వారి యొక్క సమస్యలను వివరించారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో




ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల నేపథ్యాన్ని తెలుసుకొని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అందిన ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "మీకోసం" కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల విషయంలో ఎలాంటి అలసత్వం చూపకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకొని, సంఘటన స్థలాలను సందర్శించి చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి.వి రమణ కుమార్, ఒంగోలు తాలూకా ఇన్స్‌పెక్టర్ విజయకృష్ణ, దర్శి ఇన్స్‌పెక్టర్ రామారావు, కంభం సీఐ మల్లిఖార్జున, కనిగిరి సీఐ శ్రీనివాసులు, పిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 15)
మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సోమవారం భారత జాతికి అమూల్య సేవలు అందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి లక్ష్మీ సుధారాణి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ "సర్దార్ పటేల్ స్వతంత్ర భారతదేశాన్ని సుమారు 565 సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి, దేశ సమైక్యతకు చేసిన కృషిని, ఆయన ఉక్కు సంకల్పాన్ని" కొనియాడారు. విద్యార్థులు పటేల్ చూపిన జాతీయ సమగ్రతా స్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం, నిబద్ధత గురించి వివరించి, విద్యార్థులు వారి సామాజిక సేవ మరియు దృఢ సంకల్పం నుండి స్ఫూర్తి పొందాలని కోరారు. చరిత్ర అధ్యాపకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు "ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, తమ ప్రాణాలను త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగం ఫలితంగానే నేడు మనకు భాషా ప్రయుక్త రాష్ట్రం సాధ్యమైంది" అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మండవ గోవిందమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, డిసెంబర్ 15)
మద్దిపాడు మండలం పెద్ద కొత్తపల్లి గ్రామంలో మండవ గోవిందమ్మ పెద్ద కర్మ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ పాల్గొని మండవ వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసే ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల పార్టీ సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), గట్టినేని అయన్న, సర్పంచ్ కాకి శైలజ, గ్రామ పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీకాంత్, మండల నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోతినేని బుచ్చయ్య చౌదరి కుటుంబాన్ని కూడా పరామర్శించారు.

## మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, డిసెంబర్ 15)
మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ మహనీయుల వర్ధంతి సందర్భంగా వారి స్మృతికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని ముప్పాళ్ళపాడు పీఏసీఎస్ అధ్యక్షులు కుందురు వెంకట నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, కనిగిరి నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు తాతపూడి జోన్స్ కుమార్ (బుజ్జి), తదితరులు పాల్గొన్నారు.

## నగర మేయర్ గంగాడ సుజాత నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)
ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు దంపతులు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మెన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఉడా చైర్మెన్ షేక్ రియాజ్, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా నాయకుడు కంది రవిశంకర్, టీడీపీ నగర నాయకులు, తెలుగు మహిళా నాయకురాళ్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులకు మేయర్ గంగాడ సుజాత, ఆమె భర్త ఆరుళ్ రాజు, కుమార్తె వాణి ప్రియాంక లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను దామచర్ల జనార్ధన్ రావు కట్ చేశారు. వెంగముక్కపాలెంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నూతన వస్త్రాలు మేయర్ సుజాతతో కలిసి ఎమ్మెల్యే దామచర్ల అందించారు. అనంతరం జనార్ధన్‌రావు మాట్లాడుతూ ప్రపంచమంతా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. ఏసు ప్రభువు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రతి ఏటా తన నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. మేయర్‌గా తన చివరి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నట్లు చెప్పారు.









## సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)
ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు సిఐటియు జెండాను ఎగరవేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా లేబర్ కోడ్స్ తీసుకురావడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాల నేపథ్యంలో మన రాష్ట్రంలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వెంకటేశ్వర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బయ్య, నాగేశ్వరరావు, కె.వి నరసింహారావు, హనుమంతరావు, కోటేశ్వరరావు, యోహాను, కోటేశ్వరమ్మ, రత్తాలు, హజరత్ అమ్మ, సుబ్బులు, నాగేంద్రం, కార్మికులు పాల్గొన్నారు.

## మండలంలో సిఐటియు జెండా ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 15)
సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు సందర్భంగా చీమకుర్తి సిఐటి యూ ఆధ్వర్యంలో గ్రానైట్, మున్సిపల్, కంకర ,ముఠా కార్మికులు పని ప్రదేశాల్లో కార్మికులు సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ సిఐటియూ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక కేంద్రం విశాఖపట్నంలో మహాసభలకు వేదిక కానుంది. దేశంలో నలుమూలల నుంచి కాకలదీరిన కార్మికవర్గ నాయకత్వం రానున్నారు. దేశం లో కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్తు పోరాటాలకు మహాసభ వేదిక కానుంది. జనవరి 4న జరుగుతున్న బహిరంగ సభకి ఎక్కువ సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి వీర ఆంజనేయం, జి అప్పలనాయుడు, కనకరాజు, ప్రసాదు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఇ నాగయ్య, అధ్యక్ష కార్యదర్శులు పి పద్మ, పి ఏడుకొండలు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, బ్రహ్మయ్య, కంకర ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు జి ప్రభుదాసు, సాంసన్, తదితరులు పాల్గొన్నారు.











# కార్మికుల హక్కుల హరించే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడండి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 15)

కార్మికుల హక్కుల సాధన కోసం తిరిగి కార్మిక లోకం పోరాటాలకి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జరుగునున్న సిఐటియు 18 జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఫ్లాగ్ డే సందర్భంగా సోమవారం నాడు ఉలవపాడు మండల ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉలవపాడు లోని సింగరాయకొండ బస్టాండ్ లో ఉన్న సీఐటీయూ జెండా ను ఆటో యూనియన్ మండల అధ్యక్షులు ఏ రాజారాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను రద్దుచేసి, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ల ను తీసుకొచ్చిందని, కార్మిక వర్గానికి నష్టం కలిగించే ఈ లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్ లను అమలు చేస్తూ 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టారని ఇది చాలా దుర్మార్గం అని కార్మిక వర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చడమే వీరి లక్ష్యం అన్నారు. విశాఖలోని స్టీల్ కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి4న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభ, ప్రదర్శనకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పోట్లూరి రవి, సిఐటియు నాయకులు కోదండం, సుబ్బారావు, శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చలో ఒంగోలుకి భారీగా బయలుదేరిన వైసీపీ శ్రేణులు






(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిసెంబర్ 15)

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రైవేట్ పరాన్ని వెంటనే రద్దు చేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని దేవరాజు గట్టు గ్రామం ముందుగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటి సంతకాల విజయోత్సవ కార్యక్రమంలో చలో ఒంగోలు కార్యక్రమానికి కార్యకర్తలతో నాయకులతో భారీగా బైకు ర్యాలీతో చలో ఒంగోలు కార్యక్రమానికి బయలుదేరారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రైవేటుపరం చేసి ప్రజల రక్తాన్ని తాగాలని చూస్తున్నారు. దీనికి కూటమి ప్రభుత్వమే బాధ్యతగా వహిస్తుందని. దీనిలో భాగంగా పేద కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసే వైనంగా ప్రైవేటుపరం చేస్తుందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు ప్రైవేట్ మెడికల్ కాలేజీని తీసుకొచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం నీరుగారిస్తుంది అన్నారు. ఏదేమైనాప్పటికీ పేద ప్రజల వెంట ఎప్పటికీ జగనన్న ఉంటాడని జగనన్న సారథంలో ప్రజలకు కోటి సంతకాల కార్యక్రమాలు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి మండల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు విజయవంతంగా చేశారని దీంతో పాటుగా రాష్ట్ర స్థాయిలో గవర్నర్ కూడా విన్నవించుకోవడం జరుగుతుంది అన్నారు. మెడికల్ కళాశాలను వెంటనే రద్దు చేసే అంతవరకు ఈ పోరాటం అన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల కన్వీనర్లు, జడ్పిటిసిలు, పలు విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## దేవతి భగవన్నారాయణకు ఘన సన్మానం



(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, డిసెంబర్ 15)

కడప జిల్లా బద్వేల్ పట్టణంలో జరిగిన చతుర్ధ కార్తీక వనభోజనాలకు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేసిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు దేవతి భగవన్నారాయణను బద్వేలు ఆర్యవైశ్య కార్తీక వనభోజనాల ఆర్గనైజింగ్ కమిటీ సోమవారం మంగళగిరిలోని డిబిఎన్ ఫంక్షన్‌హాలు నందు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువా కప్పి, స్వీట్ బాక్స్ అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్తీక వన భోజనాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బద్వేల్ ఆర్యవైశ్య కార్తిక వనభోజనాలకు లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించి అందజేసి వనభోజనాల కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దేవతి భగవన్నారాయణకు ఎళ్ళప్పుడు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వల్లంకొండు వెంకటరమణ, జొన్నలగడ్డ సుధాకర్, మెంటా నాగేంద్ర, పైడిమర్రి సురేష్ బాబు, చిందుకూరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు స్నేహహస్తం ఉచిత భోజన వసతితో ఆపన్నహస్తం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 15)

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేద రోగులు, వారి బంధువులు మరియు ఆహార వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసి ఆపన్నహస్తం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు , వారి బంధువులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, అనాధలకు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, "పేదవారికి ఆహారం అందించడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశను నింపుతుంది. ఈ సేవా కార్యక్రమం నిరంతరంగా కొనసాగిస్తూ మరెందరికో ఉపశమనం కలిగించాలని మా లక్ష్యం" అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం ద్వారా అనేక మంది రోగులు, వారి బంధువులు, అలాగే పేదలు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ భోజన వసతి తో పాటు వైద్య సహాయం వంటి సేవలను విస్తరించేందుకు కృషి చేస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివశంకర్, మీరా మొహిద్దిన్, కాసింపీరా, లక్ష్మణాచారి, శృతి, కిషోర్ బాబు, మెర్లిన్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పివి కృష్ణారెడ్డి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 15)

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో బద్వేలు ప్రాంతానికి చెందిన పివి కృష్ణారెడ్డి ని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నిక సందర్భంగా ఆయన సొంత మండలమైన గోపవరంలో ఉపాధ్యాయులందరూ పివి కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఉపాధ్యాయుల స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లను తొలగించి ఒకే యాప్‌ను ప్రవేశపెడతామని ప్రకటించిన నూతన ప్రభుత్వం, వాస్తవానికి అంతకంటే ఎక్కువ యాప్‌లను ఒకే యాప్‌లో ఇన్సర్ట్ చేసి ఉపాధ్యాయులను మరింత బోధనేతర పనులకు గురిచేస్తోందని విమర్శించారు. ఇది విద్యావ్యవస్థకు ఏమాత్రం దోహదపడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే ఒకటిన్నర సంవత్సరం దాటినా ఉపాధ్యాయులకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించకపోవడంతో పాటు, బోధనేతర పనుల భారం వల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను వేధించిన ఏ ప్రభుత్వమైనా మనుగడ సాగించలేదని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి నిజమైన కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# ఉపాధ్యాయుల క్రీడోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 15)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంలో జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో జరిగిన మార్కాపురం డివిజన్ స్థాయి ఉపాధ్యాయులు క్రీడోత్సవాల్లో పాల్గొని ప్రారంభించారు. సందర్భంగా కొంతసేపు స్వయంగా క్రికెట్ ఆడి ఉపాధ్యాయులను విద్యార్థులను ఉత్సాహపరిచారు. మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో పవర్ ఆఫీసులో విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మార్కెట్ యాడ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









## మునిసిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 15)

ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసి అనుబంధం ఆధ్వర్యంలో కనిగిరిలో మునిసిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐటీయూసి అధ్యక్షులు సయ్యద్ యాసిన్ పాల్గొని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని లేని యెడల సమ్మె బాట పట్టనున్నట్లు తెలిపారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మేనేజర్ ఐ ప్రసాద్‌కి అందచేశారు.

## కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిసిన మంత్రి నారా లోకేష్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ని సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా



కలిశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సహచర పార్లమెంట్ సభ్యులు.

## ప్రగల్లపాడు చెంచు కాలనీలో శానిటేషన్ పనులు

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిసెంబర్ 15)

మండలంలోని ప్రగల్ల పాడు చెంచు కాలనీ సందర్శించి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలను అనుసరించి డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి శ్రీనివాస్ కాలనీలోని ప్రజలు తాగుతున్న, నిత్యావసరాల కోసం వాడుకొంటున్న నీటి ట్యాంకును శుభ్రపరచి కాలనీలోని శానిటేషన్ పనులను చేయించారు. వీధిలైట్లు ఎన్ని స్తంభాలకు వెలుగుతున్నాయి. ఎన్ని స్తంభాలకు వెలగడం లేదు అనేది పరిశీలించి తక్షణమే 24 గంటల లోపల ప్రతి స్తంభానికి వీధిలైట్లు వెలగాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి పంచాయతీ అభివృద్ధి అధికారి ఆదేశాలతో సర్పంచ్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## చీమకుర్తిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 15)

చీమకుర్తి పురపాలక సంఘం నందు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సిబ్బంది అంబేద్కర్ నగర్ నందు డోర్ టు డోర్ కలెక్షన్ లో తడి మరియు పొడి చెత్తను వేరు చేయడం నందు ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ డి రమణారెడ్డి, తెలుగు మహిళా అధ్యక్షురాలు గంగుల శివ పార్వతి, మెప్మా సీఎంఎం రూపాలక్ష్మి, మెప్మా ఆర్పీలు దొంతు రమణమ్మ, అనిత, డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏఓఐ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో నిరసన



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 15)

ఎల్ఐసిలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వ్యతిరేకంగా ఎల్ఐసి ఏవోఐ ( సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం కనిగిరి ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెట్టడం వలన ఎల్ఐసి లో ప్రమాదం ముంచుకొస్తే ఉందన్నారు .కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ సభ్యులు కైపు వెంకటేశ్వర రెడ్డి కనిగిరి ఎస్ ఓ అధ్యక్ష, కార్యదర్శులు వీ కే రావు, ఏ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కే అనూక్, కే సునీల్, కంచర్ల సత్యనారాయణ, బషీర్, సిహెచ్ వి నారాయణ, రహమాన్, పి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంతోనే ప్రత్యేక తెలుగు రాష్ట్రం

## మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి విజయభాస్కరరావు





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 15)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక బస్టాండ్ సెంటర్లోఉన్న పొట్టి శ్రీరాములుపార్క్ ఆవరణలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు జవ్వాజి విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కస్సెట్టి రవికుమార్, సిహెచ్ సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారు కలిసి సంయుక్తంగా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మద్రాస్ టౌన్ లోని అన్నాపిలై వీధిలో 1901, మార్చి 16వ తేదీన ఒక సామాన్య ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన మహాలక్ష్మమ్మ, గురవయ్య దంపతులకు జన్మించాడన్నారు. ఆ నాడు నెల్లూరు జిల్లాగా ఉన్న సమయంలో ఆయన పూర్వీకులు కనిగిరి ప్రాంతానికి చెందినవారన్నారు. శ్రీరాములు విద్యాభ్యాసం చెన్నైలోనే కొనసాగిందన్నారు. అనంతరం శ్రీరాములు ముంబైలో రైల్వే శాఖలో నెలకు రూ.250లకు ఉద్యోగం చేశాడన్నారు. విధి నిర్వహణలో ప్రయాణికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవాడన్నారు. పొట్టిశ్రీరాములు చిన్నతనం నుండి ఆదర్శ భావాలు కలిగిన మానవతామూర్తి అన్నారు.ఈయన హరిజనోద్దరణ కోసం మిగుల కృషి చేశాడన్నారు. ఈయన స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మాగాంధీశిష్యుడిగా సబర్మతి ఆశ్రమంలో 1935లో చేరి ప్రముఖ పాత్ర పోషించాడన్నారు. ఈయన గాందేయవాది, అంతే కాక 1952లో మద్రాస్ నుండి ప్రెసిడెన్సీలో తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని కోరుతూ మద్రాస్ నడిబొడ్డున 1952 అక్టోబర్ 19 నుండి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడన్నారు. ముందుగా గొల్లపూడి సీతారాయ్య లాంటి వారు ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం దీక్ష చేసి విఫలమయ్యారన్నారు. కానీ శ్రీరాములు మాత్రం ప్రాణాన్ని సహితం లెక్కచేయకుండా పట్టు వదలని విక్రమాదిత్యుని మాదిరిగా దీక్ష చేశాడన్నారు. దీక్ష సమయంలో తేనె, నిమ్మరసం జ్యూస్ మాత్రమే సేవించి కఠోరమైన దీక్షకు పూనారన్నారు. దీంతో ఆయన ఆరోగ్యం రోజు రోజుకు క్షీణ దశకు చేరుకొని సుమారు 58 రోజులు అనగా 1952 డిసెంబర్ 15వ తేదీన శ్రీరాములు తనువు చాలించాడన్నారు. చివరికి ఆయన మృతదేహాన్ని ఎవరు పట్టించుకోని పరిస్థితి అయినప్పటికీ ప్రముఖ మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, హరిదాసులాంటి నాయకలు మాత్రమే ఆయన చెంత ఉన్నారన్నా రు. అనంతరం ఘంటసాల వెంకటేశ్వరరావు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన విధానాన్ని పాటల రూపంలో అన్ని చోట్ల ప్రదర్శింప జేసి ప్రజాచైతన్యం తేవడం జరిగిందన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు చైతన్యవంతులై తెలుగు ప్రజలందరూ ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తూ ఎక్కడికక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని స్తంభింపచేశారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆయనకు మద్దతుగా నిలిచారన్నారు. ఆయన వెంటనే 1953 అక్టోబర్ ఒకటో తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. ఉమ్మడి మద్రాస్‌లో భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఉన్న మనకు ఆంధ్ర తెలుగురాష్ట్రం, తెలంగాణ రాష్ట్రం కూడా ఏర్పడటానికి మార్గం సుగమమయిందని అన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని యువతీ, యువకులు తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని, తెలుగుజాతి సార్వభౌమత్వాన్ని అన్ని దిక్కుల చాటేందుకు అమరజీవిగా పేరుగాంచిన పొట్టి శ్రీరాములుని స్ఫూర్తిగా తీసుకొని, ఆయన ఆత్మ బలిదానంతో ఏర్పడ్డ తెలుగు రాష్ట్రాల ఔన్నత్యాన్ని దేశ నలుదిక్కుల చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కస్సెట్టి రవికుమార్, కోశాధికారి చినమనగుండా సుబ్రహ్మణ్యం, సంఘం చీఫ్ ఆర్గనైజర్ పోలేపల్లి జనార్దన్‌రావు, సంఘం సభ్యులు జవ్వాజి వెంకటేశ్వర్లు, జవ్వాజి జనార్దన్‌రావు, నేరెళ్ల జనార్దన్‌రావు, దోగిపర్తి మల్లికార్జునరావు, వాగిచర్ల మురళి, చెక్కా బాలరంగం, టిడిపి నాయకులు ఈర్ల వెంకటయ్య, గోసు వెంకటేశ్వర్లు, పొదిలి ఏఎంసి మాజీ డైరెక్టర్, జనసేనపార్టీ మండల నాయకులు గుంటూా మోషే, మండల మహిళా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గన్నారు.

# కదం తొక్కిన వైసీపీ శ్రేణులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

ఒంగోలు నగరంలో వైసీపీ శ్రేణులు కదం తొక్కారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల పత్రాలను తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి తరలించే కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో నిర్వహించిన భారీ ర్యాలీ నందు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వైసిపి శ్రేణులు పాల్గొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చర్చి సెంటర్ వద్ద నుండి జిల్లా పార్టీ కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీ నందు వైసీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం 15 నెలల పాలనలోనే ప్రజా వ్యతిరేకతను సాధించుకుంది అని అన్నారు.రాష్ట్రంలో సువర్ణ పాలన దిశగా జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలన చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుందని ఆరోపించారు.పేద ప్రజల ఉన్నత వైద్యం కోసం జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలను తీసుకువస్తే ఇప్పటి ప్రభుత్వం వాటిని ప్రవేటీకరణ చేయడం ఏమిటని మండిపడ్డారు.సంపద సృష్టిస్తామని చెప్తున్న చంద్రబాబు రాష్ట్ర సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు అని అన్నారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రజల వద్ద నుండి సేకరించిన కోటి సంతకాల సేకరణలో భాగంగా 5 లక్షలకు పైగా వచ్చినటువంటి పత్రాలను తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం కోటి సంతకాల పత్రాల వాహనాన్ని బూచేపల్లి శివప్రసాద్ తో పాటు జిల్లా వైసిపి ప్రజా ప్రతినిధులు జండా ఓకే ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు, గిద్దలూరు సమన్వయకర్త కుందురు నాగార్జునరెడ్డి, కనిగిరి సమన్వయకర్త దద్దాల నారాయణ, ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు, పార్టీ జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిలు రమణారెడ్డి, వెంకటేశ్వరరావులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











## ఆంధ్రుల ఆరాధ్యదైవం అమరజీవి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, డిసెంబర్ 15)**

మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురం నందు ఆంధ్రుల ఆరాధ్య దైవం అమరజీవి పొట్టి శ్రీరాములు అమూల్య ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ పొట్టి శ్రీరాములు దేశభక్తిని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వారు చేసిన ఆమరణ నిరాహార దీక్షను, ప్రాణత్యాగంను విద్యార్థులకు వివరించి చెప్పారు. సీనియర్ ఉపాధ్యాయిణి నాగమణి శ్రీరాములు సంఘ సంస్కరణను, హరిజనోద్ధరణ కొరకు వారు చేసిన కృషిని తెలియజేశారు. పాఠశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు ఆలపించిన జాతీయ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన






**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 15)**

రెండు కోట్ల రూపాయలతో యర్రగొండపాలెం నుండి గంజివారిపల్లి బీటీ రోడ్డు, సీసీ రోడ్డు, వెంకటాద్రి పాలెం గ్రామ మెయిన్ రోడ్డు నందు సీసీ రోడ్డుకు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, మండల టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ హాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు తెలుగుజాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, యావత్ తెలుగుజాతికి పొట్టిశ్రీరాములు నిత్యస్మరణీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చిన ఓబులేసు, ఎస్‌డిసిలు శ్రీధర్ రెడ్డి, కుమార్, జాన్సన్, మాధురి, విజయజ్యోతి, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కలపాలి

## మార్కాపురం జిల్లాకు కామ్రేడ్ పూల సుబ్బయ్య మార్కాపురం జిల్లాగా నామకరణం చేయాలి
## జిల్లాలో శ్రీశైలం మండలాన్ని కూడా విలీనం చేయాలి
## కలెక్టర్, డిఆర్ఓలకు రాతపూర్వక ప్రతిపాదనలు అందించిన సిపిఐ జిల్లా సమితి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

నూతనంగా ఏర్పాటు చేస్తున్న మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని ఉంచాలని, శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలని, మార్కాపురం జిల్లాకు మాజీ ఎమ్మెల్యే, పశ్చిమ ప్రాంత ప్రజా నాయకులు కామ్రేడ్ పూల సుబ్బయ్య మార్కాపురం జిల్లాగా నామకరణం చేయాలని సిపిఐ జిల్లా సమితి కలెక్టర్ కు, డిఆర్ఓ కు తమ ప్రతిపాదనలను రాతపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు పశ్చిమ ప్రాంత ప్రజలకు సుదూరంగా ఉండి, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మార్కాపురం ప్రత్యేక జిల్లా నినాదం ముందుకు వచ్చిందన్నారు. ప్రత్యేక మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా పోరాటాలు జరిగాయి అన్నారు. 2022లో నాటి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో పార్లమెంటు నియోజకవర్గం ఆధారంగా జిల్లాలను విభజించారన్నారు. అనేక పోరాటాలు చేసిన మార్కాపురం జిల్లా ప్రతిపాదనను నాటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. హామీల అమలులో భాగంగా జిల్లా ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి 2025 నవంబర్ 27న నోటిఫికేషన్ విడుదల చేసింది అన్నారు. ఈ నోటిఫికేషన్ లో నూతనంగా ఏర్పడుతున్న మార్కాపురం జిల్లాలో మార్కాపురం తో పాటు ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజక వర్గాలు ఉన్నాయని ప్రకటించింది అన్నారు. ముందు మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గం రథో కలిపి 5 నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించి, చివరిలో దర్శి ప్రకాశం జిల్లాలోని కొనసాగుతుందని ప్రకటించారన్నారు. ఇది ఏ మాత్రం సరైనది కాదన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో దొనకొండ మండలం ప్రారంభం అవుతుందన్నారు. కుడిచేడు, దర్శి మండల కేంద్రాలకు మార్కాపురం కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉందన్నారు. ఇలాగా కొనసాగిస్తే ప్రజలకు పాలన అందుబాటులోనికి తేవాలని ప్రభుత్వ లక్ష్యానికి విఘాతం కలుగుతుందన్నారు. ప్రభుత్వం, అధికారులు,, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరా ఆలోచన చేయాలని ఈ సందర్భంగా విన్నవించుకున్నారు. ప్రకాశం జిల్లా ఏర్పడక ముందు మార్కాపురం ప్రాంత కర్నూలు జిల్లాలో భాగంగా ఉందన్నారు. పాత మార్కాపురం తాలూకాలో శ్రీశైలం భాగంగా ఉందన్నారు. 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడిన సమయంలో శ్రీశైలంలో కర్నూలు జిల్లాలోని కొనసాగించారన్నారు. కానీ శ్రీశైలం కర్నూలు జిల్లా కేంద్రానికి 200 కిలోమీటర్ల పైగా ప్రయాణం చేయవలసి వస్తుందన్నారు. 2022లో జిల్లా పున్నమి విస్తీకరణ సందర్భంగా శ్రీశైలం నంద్యాల జిల్లాలో భాగమైంది అన్నారు. కానీ నంద్యాల జిల్లా కేంద్రానికి శ్రీశైలం ప్రజలు వెళ్లాలంటే 160 నుండి 180 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. కానీ మార్కాపురం జిల్లా కేంద్రానికి కేవలం 80 కిలోమీటర్ల దూరం మాత్రమే శ్రీశైలం ఉందన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల శ్రీశైలం కి ముఖ ద్వారం గా ఉందన్నారు. శ్రీశైలం వెళ్లే పర్యాటకుల దోర్నాలకు రాకుండా శ్రీశైలం చేరుకోవడం వీలుకాదు అన్నారు. నూతనంగా ఏర్పడే మార్కాపురం జిల్లా కేంద్రానికి అత్యంత చేరువులో ఉండే శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపటం ద్వారా ఆ మండల ప్రజలకు పాలన అందుబాటులోకి తీసుకురావడానికి వీలవుతుందన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉండే దొనకొండ మండలం, 25 కిలోమీటర్ల దూరంలో ఉండే కురిచేడు మండలం, 35 కిలోమీటర్ల దూరంలో ఉండే దర్శి మండలాలను మార్కాపురం జిల్లాలో కలపాలని, వీలైతే దర్శన చేసుకోరు కానీ మార్కాపురం జిల్లాలో కలపాలని, లేనిపక్షంలో పై మూడు మండలాల నైన మార్కాపురం జిల్లాలో కలపాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. అలాగే చారిత్రాత్మకంగా ఉన్న శ్రీశైలం మార్కాపురం ప్రాంతంలో భాగంగా ఉన్న శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలని తెలిపారు. నూతన మార్కాపురం జిల్లాలో ప్రతిపాదించిన మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి పారిశ్రామిక కారిడార్ ప్రకటించింది అన్నారు. పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వ భూములను కూడా గుర్తించిందన్నారు. బ్రిటిష్ కాలంలోనే దొనకొండ ఎయిర్పోర్ట్ నిర్మించబడిందన్నారు. రాష్ట్రానికి నడిబొడ్డుగా ఉంటుందని ఈ ప్రాంతంలోనే రాజధాని నిర్మాణం చేయవచ్చని రాష్ట్ర యువజన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన శ్రీకృష్ణ కమిషన్ నివేదిక కూడా ఇచ్చింది అన్నారు. కనుక ఇటువంటి చారిత్రాత్మక ప్రాంతంగా ఉన్న దొనకొండ మార్కాపురం జిల్లాకు కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో అత్యంత చెరువు గా ఉందన్నారు. మార్కాపురం నూతన జిల్లా అభివృద్ధికి దొనకొండ ప్రాంతాన్ని మార్కాపురం జిల్లాలో కలపటం వల్ల జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇది న్యాయమైన ప్రతిపాదనగా సిపిఐ భావిస్తుందన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి తాగునీరు అందించే లక్ష్యంగా ఆనాడు దర్శిలో ఎన్ఎస్పి స్టోరేజ్ చెరువును ప్రభుత్వ నిర్మించింది అన్నారు. ఇక్కడ నుండి కనిగిరి పొదిలి ఇతర ప్రాంతాలకు తాగునీరు అందుతుందన్నారు. ఇంటింటికి నీరు కొళాయిలు ఇవ్వటం ద్వారా తాగునీరు అందించడానికి ప్రభుత్వ ప్రణాళిక బద్ధంగా నిధులు ఖర్చు. ఇలాంటి దర్శి మండలాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించడం ద్వారా ఎటువంటి నీతి నీతి ఆధారం లేని ప్రాంతాలకు తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఈపాటికి ఖర్చు చేసిన కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం నిరూపియోగంగా మారే అవకాశం ఉందన్నారు.

ప్రజలకు ప్రాణాధారమైన తాగినీటిని మార్కాపురం జిల్లా ప్రాంత ప్రజలకు దూరం చేసి ప్రకాశం జిల్లా మీద ఆధారపడే పరిస్థితులను నెట్టివేయటం అన్యాయమని సిపిఐ భావిస్తుందన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని రక్షించుకోవడానికి అనేక సంవత్సరాలుగా పోరాటం చేసిన వ్యక్తి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేసిన ఆ ప్రాంత ప్రజానాయకుడు ప్రజలు మనలను పొందిన వ్యక్తిగా సాగునీరు, తాగునీరు ఆ ప్రాంత ప్రజలకు అందించాలని అసెంబ్లీ లోను, బయట పోరాటాలు చేసిన గొప్ప ప్రజానాయకుడు కామ్రేడ్ పూల సుబ్బయ్య పేరును మార్కాపురం జిల్లాకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నాసరయ్య, సయ్యద్, డి శ్రీనివాస్, ఎస్కె ఖాసీం, కే వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాస్, ఎం విజయ, లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరుణానిధి, ప్రభాకర్, గులామ్, తదితరులు పాల్గొన్నారు.



## డార్మిటరీలో పెట్టిన నగదు చోరీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద ఉన్న సాయి శ్రీనివాస డార్మెటరీ నందు ఆర్టీసి కండక్టర్‌గా పని చేస్తున్న అనుముల రాజు బేస్తవారిపేట, గిద్దలూరు డిపో కండక్టరు రాత్రి డ్యూటీ దిగి బెడ్డు తీసుకొని రాత్రి లాకర్లో క్యాష్ బ్యాగు పెట్టి నిద్రపోయాడు. ఉదయాన్నే లేచి లాకర్ చూడగా దానిని పగలగొట్టి అందులోని క్యాష్ బ్యాగ్ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. అందులో రూ. 14,500 వరకు ఉన్నాయన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాబ్జి ద్వితీయ వర్ధంతి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 15)**

ఒంగోలులోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో పూర్వపు ఉభయగోదావరి టీచర్ ఎమ్మెల్సీ సాబ్జి ద్వితీయ వర్ధంతిని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ కామ్రేడ్స్ సాబ్జి కుటుంబం నాలుగు తరాలుగా ఉపాధ్యాయ కుటుంబం నుంచి పుట్టిన ఉద్యమ కెరటం అని, ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని 2021 మార్చి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉభయగోదావరి నుండి మొదటి రౌండ్ లోనే 15 34 మెజార్టీతో గెలుపొంది అందరిని సంబర ఆశ్చర్యాన్ని గురి చేశారు ఎక్కడ రాజి పడకుండా ఉపాధ్యాయ ఉద్యమమే ఊపిరిగా తన ఉపాధ్యాయ సర్వీసు ఐదు సంవత్సరాల ఉన్నప్పుడే స్వచ్ఛందంగా రాజీనామా చేసిఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ తరుపునా ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందిన ఘనత సాబ్జిది అని అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో సిపిఎస్ మహాపాదయాత్ర, క్విట్ సిపిఎస్ జాత, మాస్ క్యాజువల్యా, సిపిఎస్ రద్దు కోసం అనేక ఉద్యమాలు నడిపిన ఘనత సాబ్జి గారిదని మరణించిన రోజున సాబ్జీ ఏలూరు నుండి భీమవరం మార్గమధ్యంలోని ఆకవీడులో అంగన్‌వాడి సమ్మె, అదే విధంగా భీమవరం కలెక్టరేట్లో ఆశ వర్కర్ల నిరసన కార్యక్రమానికి హాజరవుతూ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదంలో మరణించారని ఆ విధంగా అటు ఉపాధ్యాయులను కార్మిక వర్గాల్లోనూ, అంగన్వాడి ఆశా వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు అనేక ప్రజా సమస్యల మీద కూడా ఉద్యమాలు నడిపిన ఘనత సాబ్జిది అని అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమం లో ఆయన చూపిన తెగువ, గుండె నిబ్బరం, అవినీతి అధికారులు ఎదురించిన ధైర్యం, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవం కాపాడుతూ ఉద్యమాన్ని నడిపిన వ్యవహార శైలి రాబోయే తరానికి ఆదర్శమని మనమంతా ఆయన అడుగుజాడల్లో నిలిచిన రోజే ఆయనకి నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని తెలియజేశారు. కార్యక్రమాలలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు జి ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శిలు సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎం సంధ్యారాణి, రమణమూర్తి, ఎం మాల కొండయ్య, బొజ్జ ఆంజనేయులు, వై వెంకట్రావు, ఆర్ నారాయణ, సుబ్బనాచారి, ఆర్ రంగారెడ్డి, జిల్లా పెన్షనర్స్ అధ్యక్షులు జివి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మహిళల పై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం




**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 15)**

మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను, అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య బద్వేలు నియోజకవర్గ ఇన్చార్జి నాగ దాసరి ఇమ్మానుయేలు పేర్కొన్నారు. సోమవారం మహిళా సమైక్య బద్వేలు ఏరియా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం ఇన్చార్జి ఇమ్మానుయేలు మాట్లాడుతూ దేశంలోనూ ఇటు రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. వీటిని అడ్డుకట్ట వేయాలని, ఫోక్స్ చట్టం, నిర్భయ చట్టం, దిశా చట్టం, రకరకాల చట్టాలు తెచ్చినప్పటికీ, నిలువరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ పేరుతో పోటీపడుతూ, ధరలు పెంచి పోషిస్తుంటే, ఆ భారం అంతా మహిళలపై పడుతున్నది ప్రభుత్వం మద్యాన్ని పెంచి పోషిస్తుంటే, విద్యార్థులు మొదలుకొని వృద్ధుల వరకు బానిస అవుతున్నారు. చిన్నపిల్లలు అని తేడా లేకుండా మద్యం మత్తులో లైంగిక దాడులు చేసి చంపడం చేస్తున్నారు. చట్టాలు నాయకుల చుట్టాలవుతున్నాయి. వీటన్నిటినీ ఎదుర్కోవడంలో, మహిళలు ఆత్మ సైర్యంతో ముందుకు పోవాలని, మహిళల హక్కుల కోసం వారి భద్రత కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య ఏరియా నాయకులు విజయమ్మ, పట్టణ నాయకులు సలోమి, నాయకులు విజయ కుమారి, ఓబులమ్మ, కృప, సుప్రజ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## మార్కాపురంను జిల్లా చేయడం అభినందనీయం టిడిపి నాయకులు





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 15)**

మార్కాపురంను జిల్లా చేయడం అభినందనీయమని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటించడం పట్ల మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ పులి వెంకటేశ్వరరెడ్డి మండల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు ఇచ్చిన తమ మాటకు కట్టుబడి మార్కాపురంను జిల్లా చేశారన్నారు. దీంతో వెనుకబడ్డ మార్కాపురం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అవులూరి యలమంద, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాజు, పులి వెంకటేశ్వర్‌రెడ్డి, తానికొండ వెంకట్రావు, పట్టణ, మండల, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆల్ పయంబర్‌కు బాలకృష్ణ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, డిసెంబర్ 15)**

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ అల్ పయంబర్ కు నందమూరి బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షులు గాజుల చెన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గాజుల చెన్నయ్య మాట్లాడుతూ అల్ పయంబర్ గతంలో అసోసియేషన్ అధ్యక్షులుగా పని చేసినట్టు తెలిపారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందిందని, ఈ మేరకు అసోసియేషన్ నుండి రు. 25000ల నగదును ఆర్థిక సాయంగా ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల రిలీజ్ అయిన అఖండ-2 భారీగా హిట్ అయిందని, హీరో నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనివాసరావు, సంగీతం తమన్ కు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి సహకరించిన బాలకృష్ణ ఫ్యాన్స్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రామయ్య. షేక్ అబ్దుల్లా, పలసా వెంకన్నబాబు, షేక్ ఖలీల్, గొడుగు శ్రీను, షేకు నాసర్ వలి, మేళ్ల గురులింగం, ఉప్పుతోళ్ల అంజి, విజయ్, బంగారి, నాగరాజు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ కమిటీ నియామక కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 15)**

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి, బద్వేల్ నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ల నేతృత్వంలో వార్డ్ కమిటీ నియామక కార్యక్రమం బద్వేల్ మున్సిపాలిటీ 5వ వార్డులో వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, వార్డు ఇంచార్జ్ సింగసాని శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జనరల్ సెక్రెటరీ సింగసాని రాజేష్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నాయకులు కష్టపడి పనిచేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ జెండాను ఎగరవేసి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు, నూతన కమిటీని నిష్పక్షపాతంగా ఎన్నుకోవడం జరిగింది అని తెలిపారు, కమిటీ సభ్యులకు ఏ కష్టం వచ్చినా పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న 2.0లో కార్యకర్తలే పరిపాలనలో కేంద్ర బిందువుగా ఉంటారని రాబోయేది జగనన్న ప్రభుత్వం మేని నమ్మకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు కార్యదర్శులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.